క్లుప్తంగా

నాలుగు గృహాల్లో చోరీకి విఫలయత్నం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారులో తాళాలు వేసి ఉంచిన నాలుగు గృహాల్లో దొంగలు చోరీకి విఫలయత్నం చేసిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. రైల్వే ఉద్యోగి పుల్లయ్య, ఆర్మీలో పనిచేసే దాసు, కంభాల వెంకటరమణ, రామసుబ్బయ్యలు తమ బంధువుల వద్దకు వెళ్లిన సమయంలో గుర్తించిన దొంగలు వారి ఇళ్ల తాళాలు పగలగొట్టేందుకు విఫలయత్నం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎటువంటి ఆభరణాలు, నగదు చోరీ జరగలేదని ఎస్‌ఐ తెలిపారు.

పశువుల్లో సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

పుల్లలచెరువు: ప్రస్తుతం వర్షాలు పడుతున్న దృష్ట్యా పశు యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి నాగుల్‌మీరా తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పశువుల్లో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకుని సకాలంలో మందు వేయాలన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో బాలింత పశువులకు టీకాలు వేస్తారని, అవి పెద్ద అయిన తర్వాత వ్యాధులు రాకుండా, ఈతలు ఈనే సమయంలో ఇబ్బందులు పడకుండా ఉంటాయని చెప్పారు. గ్రామాల్లో పశుపోషకులకు దూడలు ఉంటే సకాలంలో సచివాలయాల పరిధిలో లేదా పశువైద్యశాలల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

నాడు-నేడుతో పాఠశాల అభివృద్ధి

కొనకనమిట్ల: రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు-నేడు కింద నిధులు విడుదల చేయడంతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేస్తున్నామని, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని గొట్లగట్టు జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌వీ సుధారాణి పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాడు-నేడు కింద అదనపు గదులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో చేరేందుకు ఎస్సీ, ఎస్టీ కులాల వారికి అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పదో తరగతిలో తొలిసారి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 31వ తేదీలోగా విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో స్పాట్ అడ్మిషన్ కోసం వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 80087 66298ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

296 మందికి వైద్య పరీక్షలు

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్లలో గిద్దలూరుకు చెందిన డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 296 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 10 మందికి ఆర్థో, ఏడుగురికి సాధారణ, ఐదుగురికి ఈఎన్‌టీ, 37 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమవుతున్నట్లు డాక్టర్లు గుర్తించారు. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జెడ్పీ చైర్‌పర్సన్ సాగర్ జలాల పరిశీలన

కురిచేడు: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శుక్రవారం సాగర్ జలాలను, ఎస్‌ఎపీ ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించనున్నట్లు ఆమె కార్యాలయ ప్రతినిధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ నీటిని చెరువుకు నింపటం, ఫిల్టర్ బెడ్ల పరిస్థితిని పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తాగునీటి సమస్యలు వివరించాలని ఆయన కోరారు.

ఉద్యాన పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన

దర్శి: ఉద్యాన పంటలు, వ్యవసాయ పంటలపై యాజమాన్య పద్ధతులపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. కార్యక్రమానికి కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌వీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాజస్థాన్‌లోని శిఖర్ ప్రాంతంలో పీఎం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమం చేపట్టారన్నారు. రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు చెప్పారు. డాక్టర్ ఎం.ఉషా, డాక్టర్ ఎం.శివ, డాక్టర్ టీవీ రెడ్డి, డాక్టర్ ఎన్.లీలాకృష్ణ, టి.మానస, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి.కోటేశ్వరరావు, జి.నాగమణి పాల్గొన్నారు.

గడప గడపతో ప్రజలకు మేలు

- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు స్వయంగా తెలుసుకుని వాటిని పరిష్కరించే వీలవుతుందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే కందులాపురం-1 సచివాలయం పరిధిలో పర్యటించారు. స్థానిక సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని), నాయకులు ఎమ్మెల్యేకు భారీ గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. నాయకులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే వారికి అందుతున్న సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకున్నా, ఇతర సమస్యలు ఉన్నా గ్రీవెన్స్‌లో నమోదు చేసుకొని వెంటనే పరిష్కరించేలా చూడాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే అన్నా ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. సంతోషంగా ఉన్నందునే ప్రజలు గ్రామాల్లో అపూర్వ స్వాగతం పలుకుతూ ఆదరిస్తున్నారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంకా ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారున్నారా, క్షేత్ర స్థాయిలో ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయో గుర్తించి వాటిని పరిష్కరించేకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందన్నారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యత వహించి పనిచేయాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు వివరించారు. సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని), ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, ఎంపీటీసీలు ఆనంద్, రఫీ, నాగరాజు, సుజాత, హసీనా, సయ్యద్ సలీం, సర్పంచ్‌లు పల్నాటి బోడయ్య, మహబూబ్ పీరా, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, నాయకులు కొత్తపల్లి శ్రీను, బత్తుల సూర్యప్రకాష్, కటికల భాస్కర్, గోపి, హుస్సేన్ బాషా, జమ్ముల దిన్నె మధుసుదన్‌రావు పాల్గొన్నారు.

తాగునీటి చెరువుకు సాగర్ జలాలు



అట్లపల్లి చెరువుకు నీరు పెడుతున్న జెడ్పీటీసీ, ఏఈ



పంపింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కురిచేడు: జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకు సరఫరా చేసిన సాగర్ జలాలను స్థానిక అట్లపల్లి రిజర్వాయర్ నింపేందుకు ఏర్పాట్లు చేశారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ థావూనాయక్‌లు తమ సిబ్బందితో సాగర్ కాలువ నుంచి పైపుల ద్వారా చెరువు నింపేందుకు చర్యలు తీసుకున్నారు. చెరువుకు నింపుతూనే ఒక పైపు ద్వారా నేరుగా ఫిల్టర్‌బెడ్‌లకు పంపేందుకు ఇటీవల జిల్లా పరిషత్ గ్రాంట్ రూ.10 లక్షలతో పైపులైను ఏర్పాటు చేశారు. సాగర్ కాలువకు నీరు సరఫరా జరిగినంతకాలం నేరుగా కాలువ నుంచి ఫిల్టర్‌బెడ్‌లకు వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. ఆ విధానాన్ని అట్లపల్లి చెరువు సగం నిండిన తర్వాత చెరువు నింపుతూ కొత్త విధానం ప్రారంభిస్తామని జెడ్పీటీసీ నాగిరెడ్డి, ఏఈ థావూనాయక్‌లు సంయుక్తంగా తెలిపారు.

దొనకొండ: మండలంలోని చందవరం సమీపంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చందవరం-1, చందవరం-2 మంచి నీటి స్టోరేజీ ట్యాంక్‌లు నిర్మించారు. ఆ ట్యాంక్‌లో నీరు సరఫరా చేసేందుకు నీటి మట్టం తగ్గిపోయింది. గత వారం నుంచి సాగర్ జలాలు కాల్వల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్‌పీ అధికారులు సమ్మర్ స్టోరేజీలకు సాగర్ జలాలు నింపే కార్యక్రమం చేపట్టారు. చందవరం-1 ట్యాంక్‌కు-4, చందవరం-2 ట్యాంక్‌కు-3 మోటార్ల ద్వారా అధికారులు యుద్ధ ప్రాతిపదికన పంపింగ్ చేయిస్తున్నారు. సాగర్ కెనాల్లో నీరు నిలిచే లోపు స్టోరేజీ ట్యాంక్‌లకు సాగర్ జలాలు సాధ్యమైనంత వరకు నింపి గ్రామాల్లోని ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా సరఫరా జరిగేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ సెక్షన్ ఇంజినీర్ షేక్ మర్దాన్‌వలి నీటి పంపింగ్‌ను పరిశీలించారు. అధికారులకు సూచనలు, సలహాలందించారు. సమ్మర్ స్టోరేజీలు నింపే వరకు జాగ్రత్తగా ఉండాలని ఆయన అధికారులకు సూచించారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



మృతుడి భార్యకు నగదు అందిస్తున్న కౌన్సిలర్ హర్షిత

మార్కాపురం టౌన్: పట్టణంలోని 16వ బ్లాక్ భగత్ సింగ్ కాలనీలో అనారోగ్యంతో మరణించిన ఎం.గురవయ్య కుటుంబానికి గురువారం మట్టి ఖర్చుల నిమిత్తం మృతుని భార్య ఆదిలక్ష్మికి రూ.10 వేల నగదును వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ దారివేముల హర్షిత అందజేశారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మహాలక్ష్మి, నాసర్‌వలి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో వివిధ తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు గిరిజన బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శామ్యూల్‌జోబు తెలిపారు. 6వ తరగతిలో 16 మంది బాలికలు, 2 బాలుర సీట్లు, 7వ తరగతిలో 1 బాలురు, 1 బాలికల సీట్లు, 8వ తరగతిలో 1 బాలిక, 4 బాలుర సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. దీంతో పాటు ఇంటర్ మొదటి సంవత్సరం హెచ్‌ఈపీ-4 సీట్లు, ఎంపీసీ-4 సీట్లు ప్రవేశం కోసం ఈ నెల 29వ తేదీ లోపు 80966 25818 నంబర్‌కు పూర్తి వివరాలతో వాట్సప్ చేయాలని ఆయన కోరారు.

ఫారెస్ట్ బీట్ అధికారికి ప్రతిభా పురస్కారం

మార్కాపురం టౌన్: మార్కాపురం అటవీ శాఖ డివిజన్ పరిధిలోని గంజివారిపల్లి రేంజ్ రేగుమానిపెంట బీట్ అధికారి నాగం రోశయ్య ఉత్తమ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. నల్లమల అటవీ ప్రాంతాల్లో పులుల సంరక్షణకు చేస్తున్న కృషికి ఈ ప్రతిభా పురస్కారం ప్రకటించారన్నారు. అటవీ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఈ నెల 29వ తేదీన అవార్డు అందుకోనున్నట్లు రోశయ్య తెలిపారు. కాగా రోశయ్యను పలువురు అటవీ శాఖాధికారులు అభినందించారు.

గృహ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

గిద్దలూరు రూరల్: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మార్కాపురం హౌసింగ్ హెడ్ నీలం వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో గురువారం హౌసింగ్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరులోగా 3527 గృహాలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 3289 గృహాలు పూర్తి చేశారని చెప్పారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా సిబ్బంది ప్రయత్నించాలని ఆదేశించారు. జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు అన్ని మౌలిక వసతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. హౌసింగ్ డీఈ ఖదీర్‌బాషా, ఆరు మండలాల ఏఈలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నారాయణరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో కర్నూలులో జరిగే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు వైష్ణవి, కృప, గోపీనాయక్, విజయలక్ష్మి, స్రవంతి, ఖాజాబీ, ఆసిఫా పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

తర్లుపాడు: స్థానిక హిందూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పలకలు, పుస్తకాలు, బలపాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షురాలు కృష్ణవేణి, జిల్లా కార్యదర్శి కె.రత్తమ్మ, చక్కా మహాలక్ష్మమ్మ, సూరె కేశవ్, వాసవీ క్లబ్ సభ్యులు లక్ష్మీదేవీ, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, సాయికుమార్, హెచ్‌ఎం అల్లూరయ్య, ఉపాధ్యాయులు నజీర్, పి.వెంకటేశ్వర్లు, మస్తాన్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై కేసులు నమోదు

మార్కాపురం/పొదిలి: మార్కాపురం, పొదిలి పట్టణాలతోపాటు కొనకనమిట్లలోని పలు ఎరువుల దుకాణాల్లో గురువారం తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్న నాలుగు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రియాజ్ తెలిపారు. వ్యాపారులు అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే సమాచారం అందించాలని సూచించారు. ఇన్‌స్పెపెక్టర్ మొహిసిన్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం టౌన్: స్వయం సహాయక సంఘాల సభ్యులు తాము తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రమేష్‌బాబు సూచించారు. గురువారం పట్టణంలోని నెహ్రూబజారులో ఉన్న కోఆపరేటివ్ బ్యాంకు వద్ద రాయవరం స్వయం సహాయక సంఘ సభ్యులకు మంజూరైన లక్ష రుణ నగదును బ్యాంకు అధికారులతో కలిసి అందించారు.

కంభంలో ప్రజాసంఘాల ర్యాలీ



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కంభం: మణిపూర్ మారణ హోమాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో కంభంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక కందులాపురం కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మహిళలపై అమానుషంగా దాడులు, అత్యాచారాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం బాధాకరమన్నారు. బాధితులు కేసులు పెడుతున్నా చర్యలు తీసుకోవడం లేదని, బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రక్షణ కరువైందన్నారు. హింసా కాండను తక్షణమే ఆపాలని, జరుగుతున్న హింసాత్మక ఘటనలకు బాధ్యత వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీయస్ నాయకులు పానుగంటి షాలెంరాజు, నేదరపల్లి జయరాజ్, పాస్టర్స్ లాజరస్, మాసిలామణి, దానం, సైలస్ జాస్వా ఏలియా, కృపాశేఖర్, కంభం ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, మహ్మద్ ఇబ్రహీం, కాకర్ల ప్రసాద్, శ్యామ్‌బాబు, యోబు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

గిద్దలూరు రూరల్: ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా నమోదు చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామసుబ్బయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సూపర్‌వైజర్లకు స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు ఎన్నికల నిబంధనలు నియమాల గురించి క్షుణ్ణంగా తెలుసుకునేలా సూపర్‌వైజర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చూడాలన్నారు. బీఎల్‌ఓలతో ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా నమోదు చేయించుకోవాల్సిన బాధ్యత సూపర్‌వైజర్లదని చెప్పారు. ఎన్నికల సమయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన నియమాలు పూర్తిగా వివరించారు. తహసీల్దార్లు డి.సీతారామయ్య, వరకుమార్, ఉమారాణి, కమిషనర్ వై.రామకృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

యర్రగొండపాలెం: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో వైవీ నాగేశ్వరప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తమ ఇంట్లో నుంచి పారే నీటిని ఇంకుడు గుంతల్లో పారే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ వెంకటనారాయణ, ఏపీవోలు నాగేశ్వరరావు, శైలజ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని తూర్పుగంగవరంలో గురువారం గూడ వెంకటరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తేజ వయో వృద్ధాశ్రమానికి చేయూత ఇచ్చారు. గూడ వెంకటరెడ్డి కుమారుడు గూడ శ్రీధర్‌రెడ్డి, ప్రసాదరెడ్డిల ఆధ్వర్యంలో రూ.50 వేల నగదు, రూ.57 వేల విలువైన బియ్యం, నూనె, పప్పుగింజలు, నిత్యావసరాలు అందించారు. గూడ సుబ్బారెడ్డి, గూడ గోపాలరెడ్డి, రాజశేఖరరెడ్డి, యేరేసి బ్రహ్మరెడ్డి, యత్తపు కాశిరెడ్డి, గూడ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

దర్శి: మండలంలోని చందలూరు, పోతవరం గ్రామాల్లో సాగు చేసిన మిరప, టమాటా నారు పెంచే నర్సరీలను ఉద్యానవనశాఖాధికారి ఎం.రవి వెంకన్నబాబు గురువారం తనిఖీ చేశారు. నర్సరీ యాజమాన్యంతో మాట్లాడుతూ నర్సరీ యాక్ట్ 2010ని తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విత్తన ఖరీదు రసీదులు, నారు మొక్కల స్టాక్, కొనుగోలుకు సంబంధించి రిజిస్టర్‌లను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. నారు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే నర్సరీ లైసెన్సు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. చందలూరు ఉద్యాన సహాయకులు డి.జాన్ గోర్డాన్, గ్రామ వ్యవసాయ సహాయకులు రవీంద్ర పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఉద్యాన శాఖాధికారి పి.విష్ణుప్రియ అన్నారు. మండలంలోని ముండ్లపాడు, బురుజుపల్లె గ్రామాల్లోని నర్సరీలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు రైతులకు విక్రయించే మొక్కలకు సంబంధించి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నాణ్యమైన మొక్కలను రైతులకు అందించాలన్నారు.

అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళి



కంభంలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు



అబ్దుల్ కలామ్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు నాయకులు

దొనకొండ: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాసు, ఉపాధ్యాయులు అబ్దుల్ కలామ్ 9వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులకు అబ్దుల్ కలామ్ సేవలు తెలియజేశారు. ఉపాధ్యాయులు సయ్యద్ సర్తాజ్ బేగం, పి.హిదయతుల్లా పాల్గొన్నారు.

కంభం: అబ్దుల్ కలాం విద్యార్థులకు ఆదర్శనీయుడని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్ అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మొఘల్ మహబూబ్ బేగ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, ఎమ్మార్పీఎస్ నాయకుడు పానుగంటి షాలెంరాజు, మహబూబ్ బాషా, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ పలి శ్రీనివాసప్రసాద్, బాలరంగయ్య, పార్శ శంకర్, ఇల్లా సోమయ్య, పీడీ మురళి, దాదా, గుండయ్య, పాండు, ఎంపీటీసీ రఫీ పాల్గొన్నారు.



ఇందిరా కాలేజీలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యాజమాన్యం

మహనీయుడు అబ్దుల్ కలాం

మార్కాపురం: మన దేశానికి విశిష్ట సేవలందించిన భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం మహనీయుడని ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిర పేర్కొన్నారు. గురువారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఇందిర ఇంజినీరింగ్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషా ఈశ్వరన్, హెచ్‌ఓడీలు సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పుష్పలత, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో అబ్దుల్‌కలాం చిత్రపటానికి డైరెక్టర్ కె.రంగయ్య, ఏఓ రంజిత్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య తదితరులు నివాళులర్పించారు.

చోరీల నిరోధంపై ప్రత్యేక దృష్టి

- డీఎస్పీ వీర రాఘవరెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో దొంగతనాలను నిరోధించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మార్కాపురం డీఎస్పీ జి.వీర రాఘవరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మార్కాపురం పట్టణంలో ఇటీవల జరిగిన రెండు చోరీల్లో నిందితులను గుర్తించేందుకు స్పెషల్ టీములను ఏర్పాటు చేశామన్నారు. వ్యాపార సంస్థల ప్రతినిధులు, గృహ యజమానులు అతి తక్కువ ఖర్చుతో తమ ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పనులు, ఇతర కార్యక్రమాలకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపైనా నిఘా ఉంచామన్నారు. ప్రజలు కూడా తమ పరిధిలో అనుమానాస్పదంగా ఇళ్ల వద్ద, వీధుల్లో ఎవరైనా తిరుగుతుంటే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



గార్లదిన్నెలో ఉత్సవాలకు సిద్ధమైన పీర్లు



మొహర్రం వేడుకలకు హాజరైన మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ, జెడ్పీటీసీ

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ గంగపాలెం మొహర్రం వేడుకల్లో దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర పాల్గొన్నారు. గ్రామంలో గురువారం పీర్ల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ముస్లిం నాయకులు డాక్టర్ మైసూర్ బాలాజీ, లాల్‌లు ఏర్పాటు చేసిన పీర్ల ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, సర్పంచ్ బ్రహ్మారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, విజిలెన్స్ కమిటీ సభ్యులు అనిల్‌రెడ్డి, బెల్లంకొండవారిపాలెం, రజానగరం సర్పంచ్‌లు పోశం సుమలతా శ్రీకాంత్‌రెడ్డి, వలి, దర్శి కౌన్సిలర్ వీసీరెడ్డి, నాయకులు యలమందారెడ్డి, వెలుగువారిపాలెం మాజీ సర్పంచ్ ఓబులరెడ్డి పాల్గొన్నారు.

పీర్ల పండగకు ఏర్పాట్లు సిద్ధం

కొనకనమిట్ల: మొహర్రం పండగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల చావిళ్లను, ఉత్సవ పీర్లను వేడుకలకు సిద్ధం చేశారు. బచ్చలకూరపాడు, గార్లదిన్నె, వెలుగొండ్రాయునిపల్లి, గరిమినపెంట, పేరారెడ్డిపల్లి, సిద్ధవరం, మునగపాడు, నాగంపల్లి, గనివానిపాడు, నాయుడుపేట, చినారికట్ల గ్రామాల్లో పీర్ల చావిళ్ల వద్ద ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం రాత్రి చిన్న షరిగత్, శనివారం పెద్ద షరిగత్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల కమిటీ పెద్దలు పేర్కొన్నారు.

పంట యాజమాన్య పద్ధతులపై శిక్షణ



మాట్లాడుతున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ

తర్లుపాడు: మండలంలోని గానుగపెంట, తర్లుపాడు రైతు భరోసా కేంద్రాల్లో పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆత్మ పీడీ అన్నపూర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో సాగు చేసే పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించి పెట్టుబడి భారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. విత్తనశుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చన్నారు. పత్తి, మిరప పంటల్లో రసంపీల్చే పురుగులను నివారించేందుకు పసుపు, నీలం రంగు జిగురు అట్టలు పొలంలో అక్కడక్కడా అమర్చాలని చెప్పారు. 30 రోజుల వయసున్న పంటకు తప్పనిసరిగా వేపనూనె పిచికారీ చేయాలని తెలిపారు. కంది, పత్తి, మిరప పంటలో వచ్చు పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శేషమ్మ వివరించారు. ఏఓ వెంకటేశ్వర్లు, ఉద్యానవనశాఖాధికారి రమేష్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజారాణి, ఎంఏఏపీ చైర్మన్ వెలుగు వెంకటేశ్వర్లు, వీఏఏలు పాల్గొన్నారు.